

పాఠశాల ప్రాంగణంలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన


వ్యర్థాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-గాలివీడు: పెద్దూరు కస్పాలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉన్న చెత్తను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. 'డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న ఉర్దూ పాఠశాల ప్రాంగణం-ఇబ్బందుల్లో విద్యార్థులు' శీర్షికతో ఈ నెల 27న ప్రజాశక్తిలో వెలువడిన కథనాన్ని స్పందించి అధికారులు వెంటనే తొలగించే చర్యలు చేపట్టారు. లక్కిరెడ్డిపల్లి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బి.విజయరామయ్య సోమవారం ఉన్నత పాఠశాల వద్దకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంపై ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. వెంటనే చెత్తను పంచాయతీ పారిశుధ్య సిబ్బందిచే తొలగించారు. స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించి నివేదికను డిఎంహెచ్ఒకు, కలెక్టర్ సమర్పిస్తానని సబ్ యూనిట్ అధికారులు పేర్కొన్నారు. ఆయన వెంట ఆశా వర్కరు, ఎఎన్ఎం,హెల్త్ అసిస్టెంట్ మల్లికార్జున స్థానికులు ఉన్నారు.

ఇరిగేషన్‌లో..హైహై నాయకా!



ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ చీఫ్ఇంజినీర్ కార్యాలయంలో ఇష్టారాజ్యం నడుస్తోంది. ఒకే అధికారి 30 ఏళ్ల కిందట నుంచి జూనియర్, సీనియర్ అసిస్టెంట్, బడ్జెట్ సూపరింటెండెంట్ వరకు అద్దె వాహనాల చెల్లింపుల సీటులో ఉండడం సమస్యకు మూల కారణమని తెలుస్తోంది. అధికారికి వివిద హోదాలు లభించినప్పటికీ అద్దె చెల్లింపుల సీటులోనే ఏళ్ల తరబడి ఉండడంతో వాహనాల అద్దె చెల్లింపుల్లో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి క్వార్టర్‌లో ప్రతి వాహనదారు నాలుగు నుంచి ఆరు శాతం వరకు చెల్లించుకోవాల్సి వస్తోందనే ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి.

- వాహనాలకు అద్దె చెల్లింపుల్లో చేతివాటం
- అన్నమయ్యలో రూ.40 లక్షలు పెండింగ్
- 4 శాతం ముట్టజెప్పకపోతే అంతే సంగతులు
- 30 ఏళ్లుగా అదే సీటులోనే బడ్జెట్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఐదు నీటిపారుదల శాఖ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. చీఫ్ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డివిజనల్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీరింగ్ హోదాల్లో పలువురు విధులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వీరిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరిధిలోని ఐదు నుంచి ఆరు అద్దె వాహనాలు ఉన్నాయి. ఈలెక్కన సుమారు 25 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరిధిలో సుమారు 106 వరకు అద్దె వాహనాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి అద్దె వాహనానికి రూ.35 వేల నుంచి రూ.60 వేల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి అద్దె వాహనాల చెల్లింపులకు నిధులు విడుదల చేస్తోంది. బడ్జెట్ సూపరింటెండెంట్ చీఫ్ ఇంజినీర్ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అద్దె వాహనాలకు చెల్లింపులు చేయాల్సి ఉంది.

అన్నమయ్యలో రూ.40 లక్షలు పెండింగ్

అన్నమయ్య డివిజన్‌లోని అద్దె వాహన యజమానులకు ఐదేళ్ల కిందట చేసిన రూ.25 లక్షల చెల్లింపులకు కమిషన్ చెల్లించలేదనే ఉద్దేశంతో చెల్లింపులు నిలిపేయడం చర్చనీయాంశంగా మారింది. ఈలెక్కన 30 నెలలుగా సుమారు రూ.40 లక్షలు అద్దె వాహనాలకు చెల్లింపులు చేయలేదనే వాదన వినిపిస్తోంది. ఐదేళ్ల కిందటి చెల్లింపులకు తాజాగా కమిషన్ ఇవ్వాలనే డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల బదిలీల్లో వచ్చిన ఇంజినీర్లు గతంలో చేసిన చెల్లింపులకు తామెందుకు కమిషన్ ఇవ్వాలని ప్రశ్నిస్తుండడం గమనార్హం.

4 శాతం చేతివాటం!

బడ్జెట్ సూపరింటెండెంట్ అద్దె వాహనాలకు అద్దె చెల్లింపుల్లో ఇష్టారాజ్యంగా వ్యహరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇరిగేషన్‌లోని ప్రతి అద్దె వాహన యజమాని నాలుగు శాతం నుంచి ఆరు శాతం వరకు ముడుపులు చెల్లించాల్సి వస్తున్నట్లు సమాచారం. లేనిపక్షంలో వారికి ఏళ్ల తరబడి చెల్లింపులు చేయని పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి అద్దె వాహన యజమాని సగటున రూ.1,500 నుంచి రూ.1,800 వరకు చేయి తడపాల్సిందేనని తెలుస్తోంది. ఈలెక్కన జిల్లాలోని 106 వాహనదారుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

తాఖీదులు..భేఖాతర్

అద్దె వాహనాల యజమానులు ప్రజాసమస్యల పరిష్కారవేదిక, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై సంబంధిత ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేసినట్లు తెలుస్తోంది. అద్దె వాహనాలకు అద్దె చెల్లింపులు చేసినట్లు ఒప్పుకుని లెటర్ ఇవ్వాలని ఓ చీఫ్ఇంజినీర్ ఒత్తిడి చేసినట్లు సమాచారం. దీనికి అంగీకరించని వాహన యజమానులు మరోసారి రాష్ట్ర కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్లక్ష్యం చూపకుండా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌ని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రజా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అత్యంత ప్రాధాన్యతతో జవాబుదారితనంతో పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంపై సిఎంఒ కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా సమస్యలను పరిష్క రించాలన్నారు. ప్రతి సమస్యకు సంబంధించిన పరిష్కారంతోపాటు ప్రజల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్‌ను కూడా ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని ఈ విషయాన్ని గుర్తెరిగి అధికారులందరూ ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించే దిశలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే బియాండ్ ఎస్ఎల్ఏ ఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలని పేర్కొన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎడి సర్వేయర్ భరత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్


సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ఎఐకెఎస్ జిల్లా నాయకులు పందికాళ్ల మణి డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బొప్పాయి రైతుల గిట్టుబాటు ధర కోసం సిఐటియు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలో దాదాపు 20 వేల ఎకరాలకు పైగా బొప్పాయి సాగు చేస్తున్నారని, రైతులు ఏడాది పాటు దుక్కిలు దున్ని, ఎరువులు వేసి మందులు, కూలీలు, రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మొదటగా రైల్వే కోడూరులో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన షేట్లు, దళారులు, సిండికేట్లు రోజురోజుకు ధరలు తగ్గిస్తున్నారన్నారు. మొదటిసారి రెండు వారాల కిందట కిలో రూ 16 ఉండగా నేడు కిలో రూ 13 తగ్గించారని, తిరిగి సోమవారం కూడా ధర తగ్గిస్తున్నారని తెలిపారు. నాసిరకం, కల్తీ విత్తనాలు రైతులుకు సరఫరా చేస్తున్నారని వాపోయారు.. 1000 కిలోలకు 100 కేజీలు తరుగు సూట్ పేరుతో రైతుల నుంచి తీసుకుంటున్నారని, రైతులను దళారులు మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్స్ లేకుండా కోట్ల రూపాయలు వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని బొప్పాయి పంటని మార్కెడు ద్వారా కొనుగోలు చేసి కనీస ధర రూ. 25 నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ స్పందించి మార్కెటింగ్ అధికారులు, ఉద్యాన అధికారులు, ఇండస్ట్రియల్ అధికారులతో, సమావేశమై రెండు రోజుల్లో విషయం చెబుతానని హామీ ఇచ్చారన్నారు. భవిష్యత్తులో బొప్పాయి రైతులు కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా, ఐక్యంగా ప్రభుత్వం పైన, మధ్య దళాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి గిట్టుబాటు ధర సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మద్దిన కోటయ్య నాయుడు, డి.గిరిబాబు రాజు, ముద్దా పెంచల్ రెడ్డి, తుంగా శివకృష్ణ చౌదరి, మన్నూరు విశ్వనాథరెడ్డి, ఈర్ల ఈశ్వరయ్య, శివారెడ్డి, నాని, రవిరాజు, వి.రాజా, చింజి సుబ్రమణ్యం, కొండల సాయిబాబు, వై.ఆదినారాయణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్‌బాబు

ప్రజాశక్తి-రాయచోటి

ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మూలస్తంభాలని డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్చన కళాశాలలో ఈనెల 28 నుండి 31 వరకు పాఠశాల నాయకత్వ లక్షణాలపై నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ తరగతుల ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారతారని తెలిపారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన బోధనా పద్ధతులను అవలంభించాలని సూచించారు. ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని సూచించారు. డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రభావితం చేసే వారందరూ లీడర్లేనని అన్నారు. విద్యార్థుల జీవితాలకు వెలుగుల నింపేలా, వారికి సరైన మార్గ నిర్దేశనం చేసేలా ఉపాధ్యాయులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. అర్చనా కళాశాల డైరెక్టర్ పాపిరెడ్డి మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ సజావుగా కొనసాగడానికి అవసరమైన అన్ని వసతులను సమకూర్చామని చెప్పారు. సమగ్ర శిక్ష ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ జనార్ధన్ మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కోర్సు కో-ఆర్డినేటర్ షమీముల్లా, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు వీరాంజనేయులు, డైట్ లెక్చరర్ కరిముల్లా, శిక్షణ ఇచ్చే మాస్టర్ ఫెసిలిటేటర్స్, జిల్లాలోని 280 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌టి వర్గీకరణతోనే యానాదులకు న్యాయం

- యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.సి.పెంచలయ్య
- డప్పులు మోగిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ
- సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పణ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, యానాదులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎస్‌టి వర్గీకరణతోనే యానాదులకు న్యాయం జరుగుతుందని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కల్లూరు చిన్న పెంచలయ్య యానాది అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పులి శివశంకర్ ఆధ్వర్యంలో రాజంపేట పాత బస్టాండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డప్పులు మోగిస్తూ, నృత్యం చేస్తూ యానాదులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌టి వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని కోరుతూ యానాది రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కల్లూరు చిన్న పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు పది లక్షల మంది యానాదులు ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో గిరిజన తెగలలో అత్యధిక జనాభాగా ఉన్న యానాదులు నేటికీ అన్ని రంగాలలో వెనకబడి ఉన్నారన్నారు. ఎస్‌సి వర్గీకరణ మాదురిగానే ఎస్‌టి వర్గీకరణ కూడా చేసి యానాదులకు చెందాల్సిన ప్రభుత్వ ఫలాలు వారికే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు బాపట్ల బ్రహ్మయ్య, ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు చేవ్వూరి సుబ్బారావు, పొన్నూరు అంకమ్మరావు, మలికి చెంచయ్య, కొమరగిరి మాల్యాద్రి, మల్లిఖార్జునరావు, దుర్గాప్రసాద్, శ్రీనివాసులు, మహిళా నాయకులు చంబేటి ఉష, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జలకం శివయ్య, జిల్లా ప్రదాన కార్యదర్శి నీలం అంకమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు వెలుగు సుధాకర్, తిరుమలశెట్టి చలపతి, సికోలు బాలాజీ, మేకల వెంకటరమణ, పులి విశ్వనాథ్, మేకల వెంకటసుబ్బయ్య, చలం వెంకటరమణ, పాలంకోట నాగరాజు, ఒంటేల మనోహర్ అల్లం నరసింహులు, కానూరు రుక్మిణమ్మ, యల్లంపల్లి అంకమ్మ, ఉమ్మడి సుబ్రహ్మణ్యం, యానాది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలు మోసం చేసిందని వైసిపి ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి విమర్శించారు మండలంలోని గోపిగుడిపల్లెలో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలతోపాటు 143 హామీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. 14 నెలలు దాటుతున్నా వాటిని అమలు చేయలేదేని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రైతులకు రెండు ఖరీఫ్ సీజన్‌లలో రైతు భరోసా ఇవ్వలేదని తెలిపారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని, మహిళలకు రూ.1500 వంటి హామీలు ఎండుమావులయ్య అన్నారు మేనిఫెస్టోను ఒక చిత్తు పేపర్ల భావించి ప్రజలను చంద్రబాబు నిలువైన మోసం చేశారని ఆరోపించారు. వైసిపి నాయకులు స్వాగతం గోపగుడిపల్లి గ్రామానికి చేసిన వైసిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, రమేష్ రెడ్డికి గ్రామ నాయకులు మంగళ్ సుబ్బయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గడికోట జనార్దన్ రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, గ్రామ సర్పంచ్ సరోజమ్మ, సుబ్బయ్య, ఎంపిటిసి మౌలా, వైసిపి రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రెటరీ సూరం వెంకట సుబ్బారెడ్డి, రేఖం నారాయణ రాజా, బసయ్య, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుదలతో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి- మదనపల్లె: మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో బిటెక్, ఎం.టెక్ చివరి సంవత్సర విద్యార్థుల కోసం 'ఆన్-క్యాంపస్ ప్రీ-ప్లేస్‌మెంట్ కనెక్ట్' సోమవారం నిర్వహించారు. ప్రఖ్యాత ఐటీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీస్ రిక్రూట్మెంట్ బృందం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్లోబల్ డెలివరీ పార్ట్‌నర్ రాఘవేంద్ర కులకర్ణి, హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ జితేందర్ సింగ్ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. రాఘవేంద్ర కులకర్ణి పరిశ్రమలో సాగుతున్న మార్పులు, డిజిటల్ పరివర్తనలో ఆవిష్కరణ పాత్ర, భవిష్యత్తు కెరీర్‌ను నిర్మించేందుకు అవసరమైన నైపుణ్యాలపై విలువైన సూచనలు ఇచ్చారు. కాగ్నిజెంట్ నియామక వ్యూహం, క్యాంపస్ నియామకాల్లో సంస్థ ఆశిస్తున్న అంచనాలు, కంపెనీలో ఉద్యోగావకాశాలకు సంబంధించి దారితీసే మార్గాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం జితేందర్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షలపై పూర్తి అవగాహనతో పాటు సేల్స్‌ఫోర్స్, సర్వీస్‌నౌ, జావా వంటి ఆధునిక టెక్నాలజీలపై ప్రావీణ్యత కలిగి ఉండాలని సూచించారు. ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యార్థులు కాగ్నిజెంట్ బృందంతో నేరుగా చర్చించే అవకాశాన్ని పొందారు. కంపెనీ పని సంస్కృతి, కెరీర్ వృద్ధి అవకాశాలపై వారు సమగ్ర అవగాహనను పొందినట్లు ప్లేస్‌మెంట్ హెడ్ వేణు చౌదరి వెల్లడించారు. కంపెనీ నుండి వచ్చిన రిక్రూట్‌మెంట్ బృందం నిరంతర సహకారం, యువతీ యువకుల ప్రతిభను ప్రోత్సహిస్తున్నందుకు యూనివర్సిటీ యాజమాన్యం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడుల కోసమే సిఎం సింగపూర్ పర్యటన : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి: ఎపిలో పెట్టు బడుల కోసమే ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనకు వెళ్లినట్లు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటన పేర్కొన్నారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని దోచుకొని పారిశ్రామికీకరణ అనే పదమే రాష్ట్రంలో వినపడకుండా చేసి ప్రజల జీవనోపాధిని వైసిపి నేతలు దెబ్బతీశారున్నారు. పేదల భూములు దోచుకోవడానికే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తీసుకొస్తే టిడిపి అంతర్జాతీయ కంపెనీల తీసుకొచ్చి యువతకు ఉపాధి అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయి, శరవేగంగా అభివృద్ధి చెందుతోంది, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాని తెలిపారు.

దశాబ్దాలుగా అద్దెభవనాల్లో పోస్టాఫీసు

- సొంత స్థలమున్నా అద్దెభవనాలకే పరిమితం
- అరకొర వసతులతో ఉద్యోగులు, ప్రజలు సతమతం


ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో పోస్టాఫీసు కొన్ని దశాబ్దాలుగా అద్దెభవనాల్లో కొనసాగుతోంది. పట్టణం నడిబొడ్డున అందరికీ అనువైన రెవెన్యూ కాంప్లెక్స్ సముదాయంలో పోస్టాఫీసుకు సొంత స్థలం ఉన్నప్పటికీ అద్దెభవనాల్లోనే కొనసాగుతుండడం గమనార్హం. ఫలితంగా పట్టణ ప్రజలతో పాటు ఉద్యోగులు సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతానికి ఎంపీలుగా పనిచేసిన వారెవ్వరూ పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి చోటుచేసుకుందని పట్టణ వాసులు వాపోతున్నారు.


పోస్టాఫీసుకు కేటాయించిన స్థలంలో దస్తావేజు లేఖరులు వేసుకున్న తాత్కాలిక టెంట్లు

రాయచోటి పట్టణంలో ఆరు దశాబ్దాలుగా పోస్టాపీసు అద్దె భవనాల్లోనే కొనసాగుతోంది. వీధి రికార్డులలో సైతం పోస్టాపీసువీధిగా నమోదైంది. ఒకటిన్నర దశాబ్దం కిందట పోస్టాఫీసును బోస్‌నగర్‌లోని మరో అద్దె రూంలోకి మార్చారు. భవనంలో వసతులు సరిపడక అటు ప్రజలు, ఇటు ఉద్యోగులు సతమతం అవుతున్నారు. కొన్నేళ్ల కిందట పోస్టాఫీసులో వాచ్‌మెన్ హత్యకు గురై కొంత నగదుకూడా అపహరింప బడడంతో భవనానికి సరైన భద్రత లేదన్న ఆందోళన ప్రజల నుండి వ్యక్తమవుతోంది. కాగా పోస్టాపీసుకు పట్టణం నడిబొడ్డున రెవెన్యూ కాంప్లెక్స్ సముదాయంలో 10 సెంట్ల సొంత స్థలం ఉంది. అధికారులు స్థలం చుట్టూ లక్షలు వెచ్చించి ప్రహరీని నిర్మించి గేటును సైతం ఏర్పాటు చేశారు. పోస్టాఫీసుకు స్వంతభవం నిర్మింప చేయాలంటూ ఈ ప్రాంతం నుండి కేంద్ర మంత్రిగా పనిచేసిన సాయిప్రతాప్‌కు, ప్రస్తుత ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి దృష్టికి పలుమార్లు ప్రజలు తీసుకెళ్ళినప్పటికీ పట్టించు కోలేదన్న బలమైన విమర్శలున్నాయి. రాయచోటి మూడేళ్ళ కిందట జిల్లా కేంద్రం కావడంతో మున్సిపల్ కార్యాలయం నిర్మాణం కోసం అక్కడ తాత్కాలిక టెంట్లలో ఉన్న దస్తావేజు లేఖరులను మూడేళ్ల కిందట అధికారులు ఖాళీచేయించారు. దస్తావేజు లేఖర్లు పోస్టాపీసు స్థలం ముందు భాగాన్ని ఆక్రమి ంచుకుని తాత్కాలిక టెంట్లను ఏర్పాటు చేసుకుని అక్కడ నుండే తమ కార్యకలాపాలను నిర్వహించుకుంటు న్నారు. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నచందంగా అందరికి అనువైన ప్రాంతంలో స్వంత స్థలం ఉన్నప్పటికీ భవనాన్ని నిర్మింప చేయడంలో ప్రజాప్రతినిధులు చూపు తున్న అలసత్వం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోస్టాఫీసును స్వతం భనంలోకి మార్చి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వెంటనే సొంత భవనాన్ని నిర్మించాలి


అద్దె భవనంలో నిర్వహిస్తున్న పోస్టాఫీసు


ప్రజలు, తపాలాశాఖ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు తీరాలంటే వెంటనే పోస్టాఫీసుకు సొంత భవనాన్ని నిర్మించాలి. పోస్టాఫీసు దశా బ్దాలుగా అద్దెభవనాల్లో కొనసాగుతుండడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరుచేసి సొంతభవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయించాలి.



- ఎస్.కె.హుస్సేన్, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షులు

సొంత స్థలమే అందరికీ అనుకూలం

రెవెన్యూ కాంప్లెక్స్ పరిధిలోని సొంతస్థలమే పోస్టాఫీసు నిర్మాణానికి అన్నిరకాలుగా అందరికి అనుకూలమైంది. 10 సెంట్ల స్థలంలో విశాలంగా జిల్లా కేంద్రం అవసరాలకు తగ్గవిధంగా భవనాన్ని నిర్మించాలి. . భవనంలో అన్నిరకాల వసతుల కల్పన ద్వారా అటు ఉద్యోగులకు, ఇటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.



- జాఫర్‌అలీఖాన్, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు


పాలిటెక్నిక్ కళాశాలలో కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, రూపానందరెడ్డి

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో ఇది కీలకమైన ముందడుగని తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీ బిసి విద్యార్థుల హాస్టల్ అవసరాన్ని గుర్తించామన్నారు. త్వరలోనే విద్యా శాఖ మంత్రికి ప్రతిపాదనలు అందిస్తామన్నారు. చదువులో ఉత్తమ ఫలితాలు సాధించడమే సందేశాన్ని అందించారు. పాలిటెక్నిక్ కాలేజ్ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కాలేజీకి కంప్యూటర్స్, కెమిస్ట్రీ ల్యాబ్ కల్పించిన ఆల్ఫా మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్ యాదవ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో పర్యటించిన 'బత్యాల'

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని జాగువారిపల్లి పంచాయతీ ప్రకాష్‌నగర్ గ్రామాన్ని సోమవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్ రాయుడు పర్యటించారు. గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా ఎవరికి ఎటువంటి కష్టం ఎదురైనా తమను సంప్రదిస్తే కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

ప్రజాశక్తి -పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట నూతన లేఅవుట్ ఆర్అండ్ఆర్ 5కు సంబంధించిన డ్రెయినేజీ, కమ్యూనిటీ హాల్, నూతన దేవాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ నదియాదేవిని సోమవారం డిఆర్‌సిసియు సభ్యులు తళ్లెం భరత్‌కుమార్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజలు పడుతున్న రేషన్ సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యానాదిరెడ్డి, గల్లా శ్రీనివాసులు, సుద్దాల వెంకటేష్, చైతన్య పాల్గొన్నారు.

వాహనదారులకు పర్మిట్లు తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం

వాహనం నడిపే ప్రతి డ్రైవర్ వద్ద వాహనానికి సంబంధించి అన్ని పర్మిట్లు కలిగి ఉండాలని, లేని పక్షంలో వారిపై కేసులు నమోదు చేస్తామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గాయత్రి అన్నారు. కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం. కసిరెడ్డి గారి పల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురం వద్ద సోమవారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి డ్రైవర్ కు వాహనానికి సంబంధించిన పర్మిట్లు, ఆర్‌సి వాహన సంబంధించి ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సులు ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌తో పాటుగా బండి లైసెన్సు, ఆర్‌సి, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గంపై చిన్న చూపేలా? : కాంగ్రెస్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రాజంపేట నియోజకవర్గం పై చిన్న చూపెందుకని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ ప్రశ్నించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మంత్రి నిమ్మలకు బుడమేరుపై ఉన్న శ్రద్ధ అన్నమయ్య ప్రాజెక్టుపై లేకపోయిందని పేర్కొన్నారు. రైల్వే కోడూరు, కడపలో పర్యటించిన ఆయనకు అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల గోడు కనిపించలేదా అని అన్నారు. ప్రాజెక్టు తెగిపోయి సర్వం కోల్పోయిన అన్నమయ్య బాధితులకు నేటికీ సంపూర్ణ న్యాయం జరగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా రైతుల పొలాల్లో వేసిన మేటలు తొలగించలేదని, ప్రాజెక్టు పునర్నిర్మాణం పట్ల పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వరదలు సర్వం కోల్పోయిన బాధితులకు ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. 22,500 హెక్టార్లకు సాగునీరు అందించే అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం పట్ల ప్రాధాన్యమివ్వాలని కోరారు. రాజంపేట నియోజకవర్గ సమస్యలు ప్రభుత్వానికి పట్టవని, ఈ నియోజకవర్గంలోనే కూడా రాష్ట్రంలోనే ఉన్నదన్న విషయం మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వం మర్చిపోయిందన్నారు.

గన్‌మెన్‌ను తొలగించడం తగదు

ప్రజాశక్తి- వీరబల్లి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్‌మెన్ కాలేషను విధుల నుంచి సస్పెండ్ చేయడం తగదు అని రాష్ట్ర ఎపిఎండిసి సంఘం ఉపాధ్యక్షులు రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న రాజంపేట ఎంపి మిధున్‌రెడ్డిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలవడానికి వెళ్లిన సమయంలో గన్‌మెన్‌ను విధుల నుంచి మూడు నెలపాటు తొలగించడం సబబు కాదన్నారు. ఏపిలో పోలీస్ వ్యవస్థ రోజురోజుకూ దిగజారి ప్రవర్తిస్తున్నదన్నారు. కూటమి నాయకులు చెప్పిన విధంగా అధికారులు భజన చేయడం మానుకోవాలన్నారు. తండ్రి వయసులో ఉన్న పెద్దిరెడ్డికి గన్ మెన్ సహాయం చేయడం నేరమా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి చేతికి ఆపరేషన్ చేయించుకున్నారని సహాయం చేస్తే అది తప్పు అవుతుందా అన్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు సతీమణి పుట్టినరోజు వేడుకలకు పోలీసులు ఎలా సాయం చేశారని గుర్తు చేశారు. వచ్చే వైసిపి ప్రభుత్వంలో అని చెప్పారు. ఇప్పటికైనా కూటమి నాయకులు అధికారుల వేధింపులు మానుకోవాలని హెచ్చరించారు.

నేటి నుంచి పట్టాభిరాముడి ఉత్సవాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వెయ్యేళ్ల చరిత్ర కలిగిన వాల్మీకిపురం పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీ పట్టాభిరాముడి పట్టాభిషేక మహోత్సవాలను ఈ నెల 29 నుంచి టిటిడి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు టిటిడి అధికారులు తెలిపారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 30వ తేదీ ఉదయం యాగశాల పూజ, స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, 6:30 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం, రాత్రి 8గంటలకు హనుమంత వాహన సేవ నిర్వహించనున్నారు. ఈ నెల 31వ తేదీ ఉదయం 6:30 గంటలకు స్నపన తిరుమంజనం, 11 గంటల నుండి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ, రాత్రి 8 గంటలకు గరుడ వాహనంపై పట్టాభిరాముడి విహారం, అనంతరం మహాపూర్ణాహుతి, కుంభోద్వాసన, కంకణోద్ఘాటన నిర్వహిస్తారు. ఉత్సవాల్లో పాల్గొనదలచిన భక్తులు రూ.300 చెల్లించి శ్రీరామ పట్టాభిషేకం ఆర్జిత సేవలో పాల్గొనవచ్చునని తెలిపారు.


పట్టాభిషేక మహోత్సవాలకు సిద్ధమైన శ్రీపట్టాభిరామాలయం

క్రీడాకారిణికి కృత్రిమ చేయి ఏర్పాటు : కలెక్టర్


కలెక్టర్ శ్రీధర్‌ను కలిసిన విద్యార్థి శివాని

ప్రజాశక్తి-రాయచోటి

పుట్టకతోనే కుడి చేయి లేకుండా విద్యార్థిని, పారా అథ్లెటిక్ క్రీడాకారిణి హెచ్.యు.శివానికి కృత్రిమ చేతిని అమర్చినట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మదనపల్లి జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని శివానికి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి మానవీయమైన చర్యకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాని విభిన్న ప్రతిభావంతుల కేటగిరి పోటీలలో షాట్‌పుట్, జావెలిన్ త్రోలలో జాతీయ స్థాయి పారా అథ్లెట్‌గా, థాయిలాండ్, బెంగళూరు, గుజరాత్ వంటి దేశీయ-అంతర్జాతీయ వేదికలపై పాల్గొని మూడు బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. ప్రతి ప్రతిభావంతుడికి అవసరమైన వనరులు అందించడం మన బాధ్యతని తెలిపారు. శివాని చదువులో, క్రీడలలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గతంలో శివాని కృత్రిమ చేయి ఏర్పాటు కోసం తనను కోరారని చెప్పారు వెంటనే స్పందిస్తూ రూ.21 వేలు మంజూరు చేయగా, కడపలోని డిస్ట్రిక్ట్ డిసెబిలిటి రిహాబిలిటేషన్ సెంటర్, దర్శిని హ్యాండిక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా రూ.39 వేలు అదనపు సహకారంతో కృత్రిమ చేయి అందించే ప్రక్రియను విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సమర్థవంతంగా పూర్తి చేసిందని తెలిపారు. శివాని మాట్లాడుతూ కలెక్టర్ దాతృత్వంతో చేసిన ఈ సహాయం వల్ల తన చదువు, క్రీడా జీవితాన్ని సమన్వయం చేసుకొని మరింత మెరుగ్గా రాణించడానికి వీలవుతుందని తెలియజేశారు. అడిగిన వెంటనే స్పందించి మరిచిపోలేని సహాయం అందించిన కలెక్టర్‌కు అధికారులకు, సంస్థలకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియచేశారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విద్యార్థుల సత్ప్రవర్తన, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. సోమవారం తవళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత భవిష్యత్తుకు చేరుకోవాలన్నారు. సత్ప్రవర్తనతో, క్రమశిక్షణతో చదువును అభ్యసిస్తే భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాలను అధిరోహించవచ్చని సూచించారు. ప్రస్తుత కాలంలో ప్రతి కుటుంబంలోనూ ఇంటర్నెట్ కలిగిన మొబైల్స్ అందుబాటులో ఉండడంతో సైబర్ క్రైమ్ అధికమవుతున్నాయని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజంలోని మహిళల పట్ల, తోటి విద్యార్థుల పట్ల సత్ప్రవర్తనతో మెలగాలని, మహిళలను, బాలికలను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన వారు వాహనాలను నడపాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. గుడ్ టచ్ బాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. బ్యాడ్ టచ్ వలన కలిగే అనర్థాలను వివరించారు. మహిళల పట్ల బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. మహిళల పట్ల బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారికి చట్టరీత్యా శిక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థినిలు కూడా ఇతరులు తమ పట్ల ప్రవర్తించే తీరును అర్థం చేసుకొని అసభ్యంగా ప్రవర్తించే వారికి తక్షణమే తగిన బుద్ధి చెప్పాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ తిప్పేస్వామి

ఇతరులు చెప్పే మోసపూరిత మాటలకు మోసపోవద్దని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అన్నారు. తల్లిదండ్రులు పడే కష్టాన్ని గుర్తించి, ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తును పొందాలన్నారు. అత్యవసర సమయాలలో మహిళలకు సహాయం అందించడానికి ప్రభుత్వం శక్తి యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోనులో ఇన్‌స్టాల్ చేసుకుని అత్యవసర, ఆపద సమయంలో పోలీసుల సహాయం కోసం ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పి4తో బంగారు భవిష్యత్తు : ఎంపిడిఒ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేద కుటుంబాలకు పి4 పథకం ద్వారా బంగారు భవిష్యత్తును అందించాలని ఎంపిడిఒ రమేష్ బాబు పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యద ర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం పి4 కార్యక్రమాన్ని చేపడుతున్నాదన్నారు. మండలంలో ప్రత్యేక అధికారులుగా మండల స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్, ఎంపిడిఒ రమేష్‌బాబు, తహశీల్దార్ తపస్వి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వారికి కేటాయించిన పంచాయతీలలో బంగారు కుటుంబాల, మార్గదర్శక కుటుంబాల ఎంపిక బాధ్యత చేపడతారన్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి వారి పంచాయతీలోని బంగారు కుటుంబాలను ఇప్పటికే గుర్తించారని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ లోపల బంగారు కుటుంబాలకు చేయూతనందించే మార్గదర్శక కుటుంబాలను ఎంపిక ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఈ మార్గదర్శక కుటుంబాలు బంగారు కుటుంబాలకు ఆర్థికంగానూ, అభివృద్ధి పథంగాను, విద్యాపరంగాను, ఇతర విధంగాను వారి అభివృద్ధికి తోడ్పాటున అందిస్తామని తెలిపారు. పేదరిక కుటుంబాలు అభివృద్ధి చెంది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీన అందించే సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం యథావిధిగా కొనసాగాలన్నారు. ఒకటవ తేదీ ఉదయాన్నే సంబంధించిన సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ కోసం వారి పరిధిలోకి వెళ్లి ఆన్‌లైన్‌లో లాగిన్ కావాలన్నారు. ప్రతి పింఛనుదారుడికి వారి ఇంటి వద్ద పంపిణీ చేయాలన్నారు. పింఛనుదారుడి సరైన ఫోన్ నెంబర్‌ను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-రామాపురం

ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో సీజన్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ గువ్వలచెరువు దళితవాడలో మూడు రోజుల నుంచి పారిశుధ్యం పై డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య సిబ్బంది పర్యటించి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వరం ఉన్న వారికి రక్త నమోనాలు తీసుకొని వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జ్వరాలు స్వల్పంగా ఉండడం వల్ల ఉన్నాయన్నారు. ప్రస్తుత సీజన్‌లో డయోరియా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. జ్వరాలు ఉన్నవారికి వైద్య పరీక్ష చేయించి మందులు అందిం చామని చెప్పారు. ప్రజలు సాగునీటిని వేడి చేసుకుని తాగాలన్నారు. వేడి పదార్థాలను తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమ తేరాలను వాడాలన్నారు. ఎవరికైనా జ్వరాలు వచ్చిన వెంటనే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి అక్కడ ఉన్న వైద్యులతో వైద్యం చేయించుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి నిల్వ ఉన్న నీటిలో లార్వాను గుర్తించి నిర్మూలించారు వారానికి ఒకసారి డ్రైడే పాటించాలని సూచించారు. తొట్లల్లో, బకెట్లలో, బిందెల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా వారానికి ఒక సారి శుభ్రం చేసుకొని కొత్తనీటిని నింపుకోవాలన్నారు.

కలికిరి: అంటు వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని హెల్త్ సూపర్వైజర్ సుధాకర్ సూచించారు. సోమవారం ఆయన కలికిరి జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని వసతి గృహాలలో దోమల నివారణకు ఆల్ఫా సైఫ్రా మైత్రిన్ 5 శాతం పిచికారి చేశారు. యాంటీ లార్వాల్ ఆపరేషన్ కూడా చేసి దోమలు ఉత్పత్తి స్థావరాలను గుర్తించి వాటిని నివారించారు. హాస్టల్లో ఎక్కడ కూడా నీటి నిలవలు ఉండకూడదని కీటక జనీత వ్యాధులపై వాటి నివారణ చర్యలపై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ముజీబ్ బాషా, హెల్త్ అసిస్టెంట్ షఫీ, జెఎన్‌టియు వైద్య సిబ్బంది లావణ్య, చాంద్ బాషా పాల్గొన్నారు.


కలికిరి: వసతి గృహంలో దోమల మందును పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది


నూతనంగా ఎన్నికైన వారితో బిఎస్‌పి నాయకులు

బిఎస్‌పి అసెంబ్లీ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రాయచోటి

బహుజన్ సమాజ్ పార్టీ రాయచోటి అసెంబ్లీ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్, జిల్లా ఇన్‌ఛార్జి మిద్దేపల్లి బాలాజీ, జిల్లా ఇన్‌ఛార్జి రమణ, జిల్లా అడ్వైజర్ ఆంజనేయులు, జిల్లా సెక్రెటరీ నరసింహులు ఆధ్వర్యంలో రాయచోటి నూతన అసంబ్లీ కమిటీ ఏర్పాటు చేశారు. అసంబ్లీ అధ్యక్షులుగా అబ్బవరం నాగేశ్వర్, అసెంబ్లీ కార్యదర్శిగా వీరపోగు కృష్ణయ్య, అసెంబ్లీ మహిళా అధ్యక్షులుగా రెబ్బ రాధ, అసెంబ్లీ మహిళా ఉపాధ్యక్షులుగా బి.లక్ష్మమ్మ, పట్టణ మహిళా అధ్యక్షులుగా ప్రియా, రామాపురం మండల అధ్యక్షులుగా వీరపోగు మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు బహుజన్ సమాజ్ పార్టీ బలోపేతం కోసం తను శక్తివంచనలేకుండా కృషి చేస్తానన్నారు.

వాల్మీకులను అన్నివిధాలా ఆదుకుంటాం

- మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి- రామసముద్రం

వాల్మీకులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. రామసముద్రం మండలంలో సోమవారం పర్యటించిన సందర్భంగా వాల్మీకి సామాజిక ప్రతినిధులు రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల హరిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వినతి పత్రం అందజేసి, వాల్మీకుల డిమాండ్లను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకులను అన్నివిధాలుగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వాల్మీకుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసి, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. వినతిపత్రంలో ప్రధానంగా ఎస్‌టి జాబితాలో వాల్మీకుల పునరుద్ధరణ, వాల్మీకుల కోసం 'వాల్మీకి నగర్' పేరుతో కాలనీల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్లు నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, శ్మశాన వాటికల స్థలాల కేటాయింపు, పేద వాల్మీకులకు జీవనోపాధి కోసం లోన్ల మంజూరు, చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కల్పన వంటి అంశాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం పూలకుంట్ల హరిబాబు మాట్లాడుతూ వాల్మీకుల జీవన స్థితిగతులు దయనీయంగా మారాయని, దశాబ్దాలుగా ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌ను పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ మంచు గురుమూర్తి, స్థానిక నాయకులు కృష్ణమూర్తి, టేకుపల్లి రమణ, పవన్ కుమార్, రాజేంద్ర, గంగన్న, విజయ్, నవీన్, హరిబాబు, గురుమూర్తి, రెడ్డి పాల్గొన్నారు.


మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన మైనారిటీ నాయకులు

వసతులు కల్పించలేమనడం దుర్మార్గం

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఆధారాలు లేని తప్పుడు కేసులో అక్రమంగా అరెస్టు చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి రాజమండ్రి జైలులో ఒక ప్రజా ప్రతినిధికి కల్పించాల్సిన వసతులను కూడా కల్పించలేమని అధికారులు చెప్పడం దుర్మార్గమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మైనార్టీ నాయకులతో కలసి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబపై ఉన్న కక్షతోనే జైలు అధికారులపై ఒత్తిడి తెచ్చి మిథున్‌రెడ్డికి ప్రజాప్రతినిధిగా అందాల్సిన వసతులును కూడా కల్పించకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. సిఎం చంద్రబాబు నాయుడును గతంలో అరెస్టు చేసినప్పుడు కోర్టు ఆదేశాల మేరకు అప్పటి వైసిపి ప్రభుత్వం జైలులో వసతులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా కక్ష సాధింపు ధోరణిలోనే వ్యవహరిస్తోందని, కోర్టు ఆదేశాలను, చట్టాలను సైతం తుంగలోకి తొక్కుతోందన్నారు. కాలం మారి అధికారం కోల్పోయినప్పుడు కూటమి పెద్దలు ఇంతకు మూడింతలు మూల్యం చెల్లించక తప్పదన్నారు. మైనారిటీల అభ్యున్నతికి, మసీదులు, ఇతర ప్రార్థనా స్థలాల అభివృద్ధికి మిథున్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి విశేష కృషి చేశారని, ఆయన చేసిన సేవలే తప్పుడు కేసుల నుంచి కడిగిన ముత్యంలా బయటపడేందుకు దోహదపడుతాయన్నారు. నాయకులు ఆబిద్, అమిన్ పీర్, సమీ, ఇమ్రాన్, జాకీర్ పాల్గొన్నారు.

బాబూ కాలనీలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

బాబూకాలనీలో సోమవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో డిఎస్‌పి మహేంద్ర డివిజన్‌లోని సిఐ, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, ఎస్‌టిఎఫ్ ఇంటింటిని గాలించి తనిఖీ చేశారు. బయట వ్యక్తులు, అనుమానితులతో మాట్లాడారు. రికార్డులు లేని 17 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మహేంద్ర మాట్లాడుతూ సారా, గంజాయి ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి పోలీస్ బృందాలతో కార్డెన్ సర్చ్ నిర్వహించామని తెలిపారు.

గండిమడుగు అభివృద్ధికి కృషి : పిఆర్ డిఇ

ప్రజాశక్తి-గాలివీడు

గండిమడుగు అభివృద్ధికి కృషి చేస్తామని పంచాయతీరాజ్ డిఇ దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన గండి మడుగును సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ సి. శ్రీనివాసులు, నూరుల్లా, కుల్లాయప్ప, కృష్ణ నాయక్, జయరామిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ప్రజలు ఆయనకు సమస్యలు వివరించారు. గండిమడుగు వద్ద ప్రహరి కూలిపోవడంతో ప్రమాదకరంగా ఉందని, గదులు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు డిఇ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూట్ ఇంజినీర్ శ్రీనివాసులు, మండల ఇంజినీర్ రాజశేఖర్, ఇంజినీరింగ్ సహాయకులు వెంకటరమణ నాయక్ పలువురు స్థానికులు పేర్కొన్నారు.


వెలిగల్లు ప్రాజెక్టుపై వెలగని విద్యుత్ దీపాలు

అంధకారంలో వెలిగల్లు ప్రాజెక్టు

- అలంకారప్రాయంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - గాలివీడు

మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టు అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు అలంకార ప్రాయంగానే మిగిలాయి. ప్రాజెక్టు ప్రధాన రహదారిపై ఉంది. నెల్లూరు నుంచి అనంతపురం, బళ్లారి వరకు వాహనాలు వచ్చిపోయే పర్యాటకలకు అనువగా ప్రధాన రహదారిపైనే ప్రాజెక్టును నిర్మించారు. ప్రారంభం వెల్‌కమ్ బోర్డు నుంచి చివరి వరకు ప్రాజెక్టుపై రోడ్డుకు ఇరువైపులా 26 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఒక్క విద్యుత్ స్తంభంలోని లైట్లు కూడా వెలగడం లేదు. విద్యుత్ స్తంభాలు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఏమైనా జరిగితే ఎవరూ పట్టించుకునే దిక్కేలేదు. అంధకారం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అటువైపు గండి మడుగు, ఇటువైపు ప్రాజెక్టు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు దృష్టిపెట్టి విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

మురుగు నీటి కాలువ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం, కదిరి రోడ్ టిప్పు సుల్తాన్ మైదానం వద్ద రూ.1.72 కోట్లతో నూతనంగా మంజూరైన పెద్ద మురుగునీటి కాలువ ఏర్పాటుకు కాలువకు సోమవారం ఎమ్మెల్యే షాజహాన్ బాష అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోళ్లబైలు, బాబు కాలనీ, రెడ్డీస్ కాలనీ, నీరుగట్టువారిపల్లి, మాయాబజార్ తదితర ప్రాంతాల్లో పడే మొత్తం వర్షపు నీరు ఇక్కడ నిర్మించబోయే మురికినీటి కాలవగుండా వెళ్తుందన్నారు. ఈ కాలువ నిర్మాణం పూర్తి అయిన తర్వాత ఎటువంటి వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండదన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. ఎన్నికలలో అక్కాచెల్లెళ్లకు ఇచ్చిన హామీ మేరకు.. ఆగష్టు 15 నుంచి మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ముందుకు సాగుతూ ఇంకా ఏమైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమవుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ మనూజరెడ్డి, మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


కాలువ నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా